సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 13 । జూలై । 2023



అమ్మవారి హుండీ లెక్కింపు

పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్ అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 105 రోజులకు రూ. 5,17,094 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.



నిరసనల సెగ

వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై మూడో రోజూ నిరసనలు కొనసాగాయి. పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. 8లో ▸



పోడూరులో గంజాయి స్వాధీనం

పోడూరులో 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు 9 మందిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. 8లో ▸

ట్రిపుల్ ఐటీ.. చదువుల దివిటీ

- టీడీపీ హయాంలో ఆరేళ్లకు విద్యార్థులపై రూ.84 వేల వరకు భారం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో ట్యూషన్ ఫీజు చెల్లింపు
- ట్యూషన్ ఫీజుకు కోతలంటూ పచ్చ పత్రిక అబద్ధపు రాతలు



నూజివీడు ట్రిపుల్ ఐటీలోని అకడమిక్ భవనం

ఫ్యాక్ట్ చెక్

నూజివీడు: ట్రిపుల్ ఐటీ.. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని పేదవర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రపంచస్థాయి సాంకేతిక విద్యను అందించేందుకు మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన విద్యాసంస్థ. వీటిని నూజివీడు, ఇడుపులపాయ, బాసరలో ఏర్పాటుచేశారు. ప్రారంభంలో రెండు వేల సీట్లతో ప్రారంభించగా రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెయ్యి సీట్లకు తగ్గించారు. పూర్తి రెసిడెన్షియల్ విధానంలో నడుపుతున్న ట్రిపుల్ ఐటీలపై పచ్చపత్రిక దుష్ప్రచారాన్ని ప్రారంభించింది. విద్యార్థులకు వసతి దీవెన డబ్బులు ఇవ్వడం లేదని, నాసిరకం భోజనం పెడుతున్నారంటూ పచ్చపత్రిక దుష్ప్రచారాన్ని చేస్తోంది. అయితే ట్రిపుల్‌ఐటీలు ప్రారంభించిన నాటి నుంచి చూస్తే వైఎస్సార్ అనంతరం, టీడీపీ ప్రభుత్వంలో ఏనాడు పూర్తిస్థాయిలో విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు చెల్లించలేదు. అంతేగాకుండా మెస్‌లలో భోజనం బాగోలేదంటూ ఎప్పుడూ విద్యార్థులు ఆందోళనలు చేసేవారు.

టీడీపీ ప్రభుత్వంలో ట్యూషన్ ఫీజుకు తూట్లు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రిపుల్ ఐటీల్లో చదివే పీయూసీ విద్యార్థులకు ఏడాదికి రూ.36 వేలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఏడాదికి రూ.40 వేలు ట్యూషన్ ఫీజు కాగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద పీయూసీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.25 వేలు, ఓసీ విద్యార్థులకు అంతకంటే తక్కువగా రూ.22 వేలు మాత్రమే టీడీపీ ప్రభుత్వం చెల్లించేది. అంటే ఒక్కో విద్యార్థి నెత్తిన రెండేళ్లకు కలిపి రూ.22 వేల నుంచి రూ.28 వేల వరకు భారం పడేది. ఇంజినీరింగ్‌లో రూ.40 వేలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.29 వేలు, ఓసీ విద్యార్థులకు రూ.24 వేల నుంచి రూ.26 వేల వరకు మాత్రమే టీడీపీ ప్రభుత్వం చెల్లించేది. దీంతో ఆరేళ్లు కలిపితే ఒక్కో విద్యార్థిపై రూ.66 వేల నుంచి రూ.84 వేల వరకు భారం పడేది. ఆ పచ్చ పత్రికకు ఇవేమీ కనిపించవు. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో చెల్లింపు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత 2020–21 విద్యా సంవత్సరం నుంచి పీయూసీ ట్యూషన్ ఫీజును రూ.45 వేలకు, ఇంజినీరింగ్ ట్యూషన్ ఫీజును రూ.50 వేలకు పెంచారు. అంతేగాకుండా విద్యాదీవెన పథకం ద్వారా పీయూసీ విద్యార్థులకు నిర్ణయించిన ఫీజు రూ.45 వేలను, ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్ణయించిన ఫీజు రూ.50 వేలను మొత్తాన్ని ప్రభుత్వం విద్యార్థుల ఖాతాల్లో జమచేస్తోంది. వాటిని విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో చెల్లిస్తున్నారు. అలాగే వసతి దీవెన కింద ప్రతి విద్యార్థికి రూ.10 వేలు చొప్పున చెల్లిస్తోంది. అంతేగాకుండా ఏమైనా మెస్ బిల్లులు బకాయి ఉంటే విద్యార్థులను అడగొద్దని సైతం ప్రభుత్వం స్పష్టం చేసింది.

రూ.185 కోట్లు వెనక్కి లాక్కొన్న టీడీపీ ప్రభుత్వం

చంద్రబాబు ప్రభుత్వం 2019 ఎన్నికలకు ముందు మహిళలందరికీ పసుపు కుంకుమ కింద రూ.10 వేలు ఇచ్చేందుకు ఆర్జీయూకేటీలో ఉన్న రూ.185 కోట్లను లాగేసుకుంది. ఇలా ఒక యూనివర్సిటీ నిధులను లాగేసుకోవడంపై అప్పట్లో అనేక విమర్శలు వచ్చినప్పటికీ ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. అంతేగాకుండా టీడీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఏనాడు సకాలంలో విడుదల కాలేదు. ఏడాది గడిచిన తర్వాత మాత్రమే బకాయిలను చెల్లించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం విద్యాదీవెనకు సంబంధించి ఎప్పటి నిధులను అప్పుడే విడుదల చేస్తోంది. అంతే గాకుండా 2018–19 విద్యాసంవత్సరానికి సంబంధించి టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి బకాయిలు పెడితే ఆ బకాయిలను సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది.

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఏ మేరీ గ్రేస్ కుమారి

దెందులూరు: కేసుల సత్వర పరిష్కారానికి బాధితులకు సకాలంలో న్యాయం అందించేందుకు లోక్‌అదాలత్ ఏర్పాటు చేశామని లోక్‌అదాలత్ శాశ్వత చైర్‌పర్సన్ ఏ.మేరీ గ్రేస్‌కుమారి అన్నారు. బుధవారం గోపన్నపాలెం సచివాలయంలో పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ.పురుషోత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ చైర్ పర్సన్ ఏ.మేరిగ్రేస్‌కుమారి మాట్లాడుతూ రవాణా, పోస్టల్, బీమా, విద్య, వైద్య, బ్యాంకింగ్, ఉపాధి, హౌసింగ్, రియల్ ఎస్టేట్, పారిశుధ్యం తదితర రంగాల్లో అన్యాయం జరిగినా శాశ్వత లోక్‌అదాలత్‌లో న్యాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో సేవలన్నీ ఉచితమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, మహిళలకు ఉచిత న్యాయసహాయం అందించామన్నారు. చిన్న చిన్న గొడవలకు కోర్టులను ఆశ్రయించి డబ్బు, సమయం వృథా కాకుండా సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కే.రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ వ్యవస్థ ద్వారా ఖైదీలకు, ముద్దాయిలకు ఉచిత సేవలు అందిస్తామన్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల సామగ్రి గొడౌన్ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలోని రిలయన్స్ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న సీడబ్ల్యూసీ గొడౌన్లను జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి కలెక్టరు పి.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, పైకప్పు, షట్టర్ల భద్రత, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. సీడబ్ల్యూసీ గొడౌన్ల విస్తీర్ణం, ఎన్ని గదులున్నవి తదితర వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. కలెక్టరు వెంట ఆర్డీఓ దాసి రాజు, జిల్లా అగ్నిమాపక దళ అధికారి బి.శ్రీనివాస రావు, తహసీల్దారు వై.రవికుమార్ తదితరులు ఉన్నారు.

22, 23 తేదీల్లో భీమవరంలో చెస్ పోటీలు



చెస్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో భీమవరంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఫైడ్ రేటింగ్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. బుధవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వివరాలు వెల్లడించారు. భీమవరం రైస్ అండ్ ప్యాడీ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు అందచేస్తామన్నారు. క్రీడాకారులు ఈనెల 20వ తేది లోపుగా పేర్లు నమోదుచేసుకోవాలని ఇతర వివరాలకు 90632 24466 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గమిని రవి పవన్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళీ, కొల్లేపర మౌళి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



కాపవరంలో సురక్ష శిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వర రావు కోరారు. పాలకొల్లు మండలం కాపవరం బీసీ కమ్యూనిటీ హాలు ఆవరణలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరంలో 14 రకాల రక్త పరీక్షలు నిర్వహించి, 105 రకాల మందులను రోగులకు అందిస్తున్నట్లు వివరించారు. గర్భిణులు, బాలింతలకు సుగర్, బీపీ పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఆరోగ్యశ్రీలో వైద్య చికిత్సలు పొందిన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను ప్రభుత్వ వైద్యులు ఆరా తీసి ఆరోగ్య సలహాలు అందించనున్నామన్నారు. అనంతరం చింతపర్రులో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.అద్దాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీ ఏర్పాటుపై హర్షం

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయడం శుభ పరిణామమని ఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెర్సు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన 12వ పీఆర్‌సీ కోసం కమిషన్‌లో విధులు నిర్వహించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ మన్‌మోహన్‌సింగ్‌ను నియమించడం ఉద్యోగులకు ఉపయోగకరం అన్నారు. మన్‌మోహన్‌సింగ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సైతం విధులు నిర్వహించారని, ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

వశిష్ట వారధి రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



వశిష్ట వారధి లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: నరసాపురం వశిష్ట వారధి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. దీనికి సంబంధించి భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు పరిహారాన్ని అందించే పనులు పూర్తి కావడంతో బుధవారం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, సబ్ కలెక్టర్ సూర్యతేజలు సంయుక్తంగా లక్ష్మణేశ్వరం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వశిష్టవారధి నిర్మాణానికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసిన 3 నెలల కాలవ్యవధిలోనే అత్యంత పారదర్శకంగా స్థలసేకరణ పూర్తి ఖాతాల్లో పరిహారం సొమ్ములు జమ చేసే వరకూ తీసుకొచ్చామని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలు, ఇళ్లు కోల్పోయిన పలువురు వ్యక్తులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. సుమారు రూ.600 కోట్లతో వశిష్ట వారధి వంతెన, అప్రోచ్ బైపాస్ రహదారి నిర్మాణానికి అడ్మినిస్ట్రేటివ్ అనుమతి పూర్తి చేసుకుని టెండర్ల దశలో ఉందన్నారు. టెండరు దశ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించిన రోజు నుంచి ఏడాదిన్నరలోపు వారధి నిర్మాణం పూర్తి చేసేలా అగ్రిమెంటు ఉందని ప్రసాదరాజు పేర్కొన్నారు. వంతెనకు సంబంధించి రైతులకు రూ.60 కోట్లు రెండు రోజుల్లో జమ కానుందన్నారు. నరసాపురం మండలంలోని రాజుల్లంక, యర్రంశెట్టివారిపాలెం, సీతారామపురం, లక్ష్మణేశ్వరం గ్రామాలకు సంబంధించి సుమారు 7.5 కిలోమీటర్ల మేర 50 ఎకరాల భూమి సేకరణ చేశామన్నారు. దీనికి సంబంధించి రూ.31 కోట్ల పరిహారం జమకానుందన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో సఖినేటిపల్లి మండలంలో రామేశ్వరం, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి గ్రామాల్లో కలసి సుమారు 44 ఎకరాల భూమిని సేకరించారన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశం

గిరిజన సంక్షేమ వసతిగృహాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర



పులిరామన్నగూడెంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

బుట్టాయగూడెం: మండలంలోని పులిరామన్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ వసతిగృహంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు.. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థి మృతి సంఘటన చాలా బాధాకరమని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడి పరిస్థితులు చక్కబడే వరకూ వసతిగృహంలో భద్రత కోసం పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. వసతిగృహాల్లో చదువుతున్న పిల్లల రక్షణ, సంరక్షణ బాధ్యత సంబంధిత ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌లదే అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి బాలుడు మృతికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్, నైట్ వాచర్‌లను జిల్లా కలెక్టర్ ఇప్పటికే సస్పెండ్ చేశారని అన్నారు. బాలుడి హత్యకు సంబంధించి పోలీసులు, అధికారులు సమగ్రమైన దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. వసతిగృహంలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.మురళి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓ జీవీవీ సత్యనారాయణ, ఆర్‌డీఓ ఎం.ఝాన్సీరాణి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రమాదేవి, తహసీల్దార్ ఎస్. శారా శాంతి పాల్గొన్నారు.

వసతిగృహంలోనే పీఓ, ఏపీఓ బస

బుట్టాయగూడెం: కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజన వసతిగృహంలో ఐటీడీఏ పీఓ సత్యనారాయణ, ఏపీఓ, ఇన్‌చార్జ్ డీడీ నాయుడు బస చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో మనోధైర్యాన్ని నింపేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే అధికారులు అక్కడ రాత్రి నిద్రించారు. అలాగే పోలీసు పికెటింగ్ కూడా ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ కూడా బస చేస్తారని చెప్పారు.

దేవాలయాలకు మహర్దశ

- 26 ఆలయాల అభివృద్ధికి రూ. 21.64 కోట్లు
- రెండేళ్లలో పనులు పూర్తి



వీరవాసరం మండలం నవుడూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయం

సాక్షి, భీమవరం: జిల్లాలోని అనేక దేవాలయాలకు మహర్దశ పట్టనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవాలయాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడమే కాకుండా ధూపదీప నైవేద్యాలకు, అర్చకుల జీతాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారు. అర్చకులకు కనీస వేతనం అమలు చేస్తున్నారు. అంతేగాకుండా దేవాలయాలకు టీటీడీ ఆధ్వర్యంలో మైక్‌సెట్, కొత్తగా నిర్మించిన ఆలయాల్లోని విగ్రహాలను సబ్సిడీపై అందించడం చేస్తున్నారు. బలహీన వర్గాల ఇళ్ల కాలనీలో దేవాలయ నిర్మాణానికి టీటీడీ తరఫున రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 26 దేవాలయాలను అభివృద్ధి చేయడానికి కామన్ గుడ్‌ఫండ్(సీజీఎఫ్) పథకంలో సుమారు 21.64 కోట్లు మంజూరుచేశారు. దీనిలో ఆయా దేవాలయాలు మూడో వంతు మ్యాచింగ్ కంట్రిబ్యూషన్‌గా చెల్లించాల్సివుండగా మిగిలిన మొత్తాన్ని సీజీఎఫ్ నుంచి విడుదల చేస్తారు. ఈ నిధులతో దేవాలయ ముఖ మండప నిర్మాణ, విమాన గోపురం, ధ్వజ స్తంభం, వాహన శాల వంటి ప్రాధాన్యత కలిగిన పనులు చేపడతారు. దేవాలయాల అభివృద్ధికి దేవాలయాధికారి వేసిన అంచనా మొత్తంలో 1/3 వంతు మ్యాచింగ్ కంట్రిబ్యూషన్‌గా చెల్లిస్తే 2/3వ వంతు సీజీఎఫ్ నుంచి నిధులు విడుదల చేస్తారు.

26 దేవాలయాల అభివృద్ధి

భీమవరం పట్టణంలోని శ్రీ సీతారామలింగేశ్వర స్వామి దేవస్థానం నిర్మాణానికి రూ.కోటి అంచనా వేయగా దానిలో 33.34 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్‌గా చెల్లిస్తే దేవదాయ శాఖ రూ. 66.66 లక్షలు మంజూరు చేస్తోంది. ఇరగవరం గ్రామంలోని శ్రీపాలేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 32.50 లక్షలు, భీమవరం మండలం కొమరాడలో శ్రీ శివకేశవస్వామి దేవస్థానానికి రూ.కోటి, పెంటపాడు మండలం బి.కొండేపాడు గ్రామంలో కనకదుర్గమ్మ దేవాలయానికి రూ.70 లక్షలు మంజూరు చేశారు. నరసాపురం మండలం ఎల్‌బీ చర్లలోని శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానానికి రూ.70 లక్షలు, ఉండి మండలం చెరుకువాడ గ్రామంలోని శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 90 లక్షలు, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి రూ.90 లక్షలు, కాళ్ల మండలం జక్కరంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.కోటి, ఉండి మండలం చిలుకూరులో కోదండ రామాలయం దేవస్థానానికి రూ.90 లక్షలు, తాడేపల్లిగూడెం పట్టణంలోని శ్రీ బలుసులమ్మ దేవస్థానానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయి. వీరవాసరం మండలం నవుడూరులోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.90 లక్షలు, తాడేపల్లిగూడెం మండలం ముత్యాలబపురంలోని శ్రీ ముత్యాలమ్మ దేవస్థానానికి రూ.కోటి, పెనుమంట్ర మండలం వెలగలేరులోని శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానానికి రూ.1.50 కోట్లు, పోడూరు మండలం కవిటంలోని శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 27 లక్షలు, పెంటపాడు మండలం కస్పాపెంటపాడు గ్రామంలోని శ్రీగోపాల, ఆంజనేయ స్వామి(బైరాగిమఠం) దేవస్థానానికి రూ. కోటి, ఆకుతీగపాడు గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ దేవస్థానానికి రూ. 20 లక్షలు, పెంటపాడులోని శ్రీగౌరిదేవి అమ్మవారి దేవస్థానానికి రూ. కోటి, వల్లూరుపల్లిలోని శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 1.50 కోట్లు, దర్భిపర్రులో శ్రీరామలయానికి రూ.70 లక్షలు, ఇరగవరం మండలం రేలంగి గ్రామంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి రూ. 80 లక్షలు, పెనుమంట్ర మండలం కొయ్యేటిపాడులోని శ్రీ మదనగోపాలస్వామి దేవస్థానానికి రూ.70 లక్షలు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురంలోని శ్రీ అలుసులమ్మ దేవస్థానానికి రూ. 60 లక్షలు, తాడేపల్లిగూడెం పట్టణం రామారావుపేటలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానానికి రూ. కోటి, తాడేపల్లిగూడెం మండలం కడియద్దలోని శ్రీ గణపతి సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానానికి రూ. కోటి, కుంచనపల్లిలో దేశాలమ్మ దేవస్థానానికి రూ. 50 లక్షలు, తాడేపల్లిగూడెం పట్టణం ఆర్టీసీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి రూ. 65 లక్షలు మంజూరయ్యాయి.

రెండేళ్లలో పనులు పూర్తి చేయాలి



జిల్లాలోని 26 దేవాలయాల అభివృద్ధికి దేవదాయ శాఖ రూ. 21.64 కోట్లు సీజీఎఫ్ నిధులు మంజూరు చేసింది. ఆయా దేవాలయాలకు సంబంధించి మూడో వంతు మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ చెల్లించాల్సివుంది. రెండేళ్లలో పనులు పూర్తి చేస్తాం.

– ఏబీ సుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయ శాఖ

అడ్మిషన్లు లేని విద్యాసంస్థల గుర్తింపు రద్దు



గేర్ సర్వేకు రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో డీఈఓ వెంకటరమణ తదితరులు

సాక్షి, భీమవరం: జిల్లాలో అడ్మిషన్స్ లేని ప్రైవేటు జూనియర్ కళాశాలలు, పాఠశాలల గుర్తింపు రద్దు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గేర్ సర్వే–స్థూల నమోదు నిష్పత్తిపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరిన రోజునే అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాలని.. కొన్ని విద్యాసంస్థల్లో మొత్తం ఫీజు చెల్లించే వరకు వేచిచూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని 18 ఏళ్లలోపు బాలలు కచ్చితంగా చదువుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 2,56,739 మంది బాలలను సర్వే చేయగా 10,825 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు గుర్తించారని వీరంతా ఇతర ప్రాంతాల్లో చదువుకుంటున్నారా? పనిలో ఉన్నారా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో విచారణ చేయిస్తామన్నారు. డ్రాపవుట్స్ లేకుండా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. జగనన్న విద్యా కానుక ఈకేవైసీ నూరు శాతం పూర్తి చేయాలని నాడు–నేడు పనులను విధిగా తనిఖీ చేసి లోపాలు ఉంటే నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, ఎస్ఎస్ఏ ఏపీఓ పి.శ్యాంసుందర్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఓ కె.చంద్రశేఖర్ బాబు, ఉండి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు. భీమవరం మండలం బలుసుమూడి, చినఅమిరం సచివాలయాలను సందర్శించి గేర్ సర్వేకు సంబంధించిన రికార్డులను, కంప్యూటరైజ్డ్ డేటాను కలెక్టర్ తనిఖీ చేశారు.

క్లుప్తంగా

జంగారెడ్డిగూడెంలో చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని హెడ్‌పోస్టాఫీస్ సమీపంలో ఉన్న కృష్ణతేజ క్రియేషన్స్ షాపులో జరిగిన చోరీపై బాధితుడు విత్తనాల రత్నరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.భీమశేఖర్ బుధవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం గత నెల 27వ తేదీ రాత్రి 10.30 గంటలకు రత్నరాజు షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. 28వ తేదీ ఉదయం షాపు వద్దకు రాగా, షాపు తాళం పగులగొట్టి ఉంది. అందులోని కంప్యూటర్ మోనిటర్, రెండు కెమెరాలు, జిరాక్స్ మెషీన్, రూ.10 వేలు నగదును చోరీ చేసినట్లు గుర్తించాడు. వాటి కోసం వెతికినా తెలియకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేశాడన్నారు. చోరీ సొత్తు విలువ రూ.1 లక్ష ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

ముసునూరు : పట్టపగలు ఇద్దరు ఆగంతకులు మహిళ మెడలో గొలుసు అపహరించారు. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బలివే శివారు వెంకటాపురం గ్రామంలో వాలం భువనేశ్వరి అనే మహిళ మంగళవారం పశువులను మేపేందుకు పొలంలోకి తోలుకెళ్లింది. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి అరటి తోటలు ఎటు వైపు ఉన్నాయంటూ దగ్గరకు వచ్చి ఆమెను అడిగారు. సమాధానం చెప్పేలోపే చీర చెంగుతో ఆమె నోరు కట్టేసి మెడలో ఉన్న 20 గ్రాముల బంగారపు నానుతాడుని తెంపుకుని పరారయ్యారు. అనంతరం జరిగిన విషయాన్ని భర్తకు ఫోన్ చేసి తెలియజేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పవన్ వ్యాఖ్యలపై తగ్గని నిరసనల సెగ

- మండిపడుతున్న వలంటీర్లు.. కొనసాగుతున్న ఆందోళనలు
- పలుచోట్ల పవన్ దిష్టిబొమ్మల దహనం

కొయ్యలగూడెం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై జిల్లాలో బుధవారం మూడో రోజూ నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. పలుచోట్ల పవన్ దిష్టిబొమ్మలను వలంటీర్లు దహనం చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలోని బోడిగూడెంలోని ప్రధాన కూడలిలో వలంటీర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ దిష్టిబొమ్మను దహనం చేసి, పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోగా మూర్ఖత్వంతో ఇప్పటికీ సమర్థించుకోవడం దారుణమన్నారు. ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆరోగ్య సంబంధిత అంశాలపై వలంటీర్లే కాదు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాసాధికారిక సర్వే బృందంలోని సభ్యులు కూడా వెళుతుంటారని, అలా వెళ్లిన వారిని అందరిని పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు అవమానించే విధంగా ఉన్నాయన్నారు. వలంటీర్లను చులకనగా చేసి మాట్లాడుతుండటాన్ని ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ నూకల రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, 30 మందికి పైగా వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్‌కు మహిళలను గౌరవించే తత్వం లేదు

కామవరపుకోట: పవన్ కల్యాణ్‌కు మొదటి నుంచి మహిళలను గౌరవించే తత్వంలేదని జెడ్పీటీసీ సభ్యుడు కడిమి రమేష్ విమర్శించారు. మండలంలో ఆడమిల్లి, తడికలపూడి సెంటర్లో గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొని పవన్ కల్యాణ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు, తడికలపూడిలో జెడ్పీటీసీ సభ్యులు కడిమి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొని పవన్ కల్యాణ్ చిత్రపటానికి చెప్పులు దండ వేసి ఊరేగించారు. అనంతరం పవన్‌ను దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ నీతి నిజాయతీతో ప్రజలకు సేవ చేస్తున్న తమను పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేసి విమర్శించడం తగదని, వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తడికలపూడి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీకాకుళపు నాగరాజు, గంగుల వెంకట్రావు, వలంటీర్లు అనిత, రమేష్, అనుపమ తదితరులు పాల్గొన్నారు



కుక్కునూరులో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

కుక్కునూరు: కుక్కునూరు సచివాలయ పరిధిలోని వలంటీర్లు కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో బుధవారం పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ పనితీరు మెచ్చి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూస్తుంటే తాను ఎమ్మెల్యే కావడం కోసం పవన్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు సామాన్యులైన వలంటీర్లను పావులుగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కరోనా కష్టకాలంలో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్న సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తాము ప్రతి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుని సరుకులు పంపిణీ చేశామన్నారు. పవన్ వలంటీర్లకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుక్కునూరు-1, -2 సచివాలయ పరిధిలోని వలంటీర్లు పాల్గొన్నారు.



గుండుగొలనులో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



తడికలపూడిలో పవన్ చిత్రపటానికి చెప్పులు దండ వేసి ఊరేగిస్తున్న వలంటీర్లు


పవన్‌పై వలంటీర్ల ఆగ్రహం

నరసాపురం రూరల్: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నరసాపురం అంబేద్కర్ సెంటర్లో వలంటీర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా రూరల్ సీఐ కార్యాలయానికి చేరుకుని పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. అటువంటి వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా పవన్ చిత్రీకరిస్తూ తమ మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం దారుణమన్నారు. కోవిడ్ సమయంలో ప్రజల్ని నిర్బంధించడం వల్ల కరోనా వ్యాప్తిని కట్టడి చేయగలిగామన్నారు. కోవిడ్ రోజుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన తమపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వలంటీర్లకు పవన్ బహిరంగ క్షమాపణ చెప్పే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. పవన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సీఐను కోరుతూ ఫిర్యాదును అందించారు. మండలంలోని వివిధ సచివాలయాలకు చెందిన వలంటీర్లు వేగి అనిల్‌కుమార్, చిట్టూరి కిరణ్, జి.రమేష్ పాల్గొన్నారు.

గుండుగొలనులో నల్లబ్యాడ్జీలతో నిరసన

భీమడోలు: వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు బుధవారం గుండుగొలనులో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించి ప్రధాన రహదారిపై దహనం చేశారు. తొలుత సచివాలయం-1 వద్ద నుంచి నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన ర్యాలీ, ప్రదర్శన చేశారు. వలంటీర్లపై నోటికొచ్చినట్లు దుర్భాలాడుతున్న పవన్ కల్యాణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తొలుత వలంటీర్లు ప్లకార్డులను చేతపట్టుకుని పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ నిరసనను వ్యక్తం చేశారు. డౌన్ డౌన్ పవన్ అంటూ నినదించారు. వలంటీర్లు కురమా అనిల్, శ్రీకాంత్, కనకరాజు, నళిని, నరేష్, వరలక్ష్మి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు చేరడంలో పారదర్శకంగా సేవలందిస్తున్న తమపై అభాండాలు వేయడం తగదన్నారు. అనంతరం రహదారిపై పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్



బీసీలపై కేంద్రానికి చిన్నచూపు తగదు

ఉండి : దేశంలో బీసీలపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆలిండియా బీసీ ప్రజావెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు విమర్శించారు. బుధవారం ఉండిలో బీసీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జనాభా ప్రతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తమ విన్నపం మేరకు బీసీ కులగణనకు కమిషన్ ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ కులగణనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాన్ని తామంతా స్వాగతిస్తున్నామన్నారు. అలాగే కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి దానికి ఏటా రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని కోరారు. అప్పుడు మరింత వెనుకబడిన బీసీ కులాలకు చెందిన వారు అభివృద్ధి పథంలో నడుస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని బీసీ గణన చేపట్టాలన్నారు. తద్వారా ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నామన్నారు. కులగణన జరగకపోవడంతో 34 శాతం ఉండాల్సిన బీసీ రిజర్వేషన్లు ఇప్పుడు 24 శాతానికి పడిపోయాయన్నారు. కులగణన చేపట్టి 34 శాతం ఉండాల్సిన రిజర్వేషన్‌లను బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్ బీసీలకు అధికంగా రిజర్వేషన్‌లు కల్పిస్తున్నారంటూ వాటిని తగ్గించాలని కోర్టుకు వెళ్లడం బీసీలను మరింత అణచివేసే కార్యక్రమంలో భాగమేనన్నారు. బీసీల వెన్నంటి ఉండి వారి పురోభివృద్ధికి పాటుపడే వారికి మాత్రమే బీసీల మద్దతు ఉంటుందని వెంకటేశ్వరరావు అన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిప్పాడ శంకరా, జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యం, మల్లాడి వెంకటేశ్వర్లు, దొమ్మేటి వేణుగోపాలరావు, పొల్లవరపు వెంకటసత్యనారాయణ, పట్టణాల శేషగిరిరావు పాల్గొన్నారు.



ఉండిలో మాట్లాడుతున్న గూడూరు వెంకటేశ్వరరావు

పశువుల అక్రమ రవాణా.. ఇద్దరి అరెస్టు

జంగారెడ్డిగూడెం: రెండు వాహనానాల్లో ఆవులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెంలో బైపాస్‌రోడ్డు ఎస్సార్ బంక్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపు రెండు వాహనాల్లో ఆవులను తరలిస్తున్నారని, వాటిని తనిఖీ చేయగా, ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా తాళ్లతో ఆవులను కట్టి ఒక వాహనంలో 35 ఆవులు, మరో వాహనంలో 38 ఆవులను తరలిస్తూ కనిపించారన్నారు. వీరి వద్ద పశువులను తరలించేందుకు ఎటువంటి అనుమతి పత్రాలు లేవని, ఆవులను హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నారన్నారు. దీంతో పశువుల అక్రమ రవాణా నేరంపై ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని, ఆవులను రాజమండ్రి గోశాలకు తరలించడం జరిగినట్లు ఎస్సై తెలిపారు.

పాలకోడేరు పీహెచ్‌సీకి మూడు అవార్డులు

పాలకోడేరు: జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు అత్యధికంగా చేసిన పాలకోడేరు పీహెచ్‌సీకి మూడు అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగమ నాయుడుకు, ఏఎన్‌ఎం సామ్రాజ్యం, వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి కె.శ్రీరామచంద్రమూర్తికి కలెక్టర్ ప్రశాంతి బుధవారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు మాట్లాడుతూ పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలో వేసక్టమి ఆపరేషన్లను ప్రోత్సహించే విధంగా చేసిన కృషిని ఉన్నతాధికారులు గుర్తించి అవార్డుతో పాటు నగదు బహుమతులు కూడా అందించారన్నారు. అలాగే పాలకోడేరు సెకండ్ ఏఎన్‌ఎం సామ్రాజ్యం 35 ట్యూబెక్టమి ఆపరేషన్లను ప్రోత్సహించినందుకు అవార్డు, నగదు బహుమతిని డాక్టర్ ప్రశాంతి అందించారన్నారు. ఈ అవార్డులు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ అవార్డులు బాధ్యతను మరింత పెంచాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు, ఏఎన్‌ఎం సామ్రాజ్యంలను కలెక్టర్ ప్రశాంతి, డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ స్వర్ణ నిరంజని, డాక్టర్ సీత, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సుజనా, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి అభినందనలు తెలిపారు.



డాక్టర్ రంగం నాయుడుకు అవార్డు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు

ఏటీఎంలో చోరీకి యత్నం.. వ్యక్తికి రిమాండ్

వీరవాసరం: ఏటీఎంలో చోరీకి యత్నిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పి.రమేష్ బుధవారం చెప్పారు. నవుడూరు జంక్షన్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో గత రాత్రి దొంగతనానికి ప్రయత్నిస్తుండగా హైదరాబాద్‌లో ఉన్న సీసీ కెమెరాలు కంట్రోల్ కమాండ్ పాయింట్ నుంచి వచ్చిన సమాచారం మేరకు అర్ధరాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చోరీకి యత్నించిన కొణితివాడ శివారు బుధారాయుడి చెరువుకు చెందిన పెంటకోటి అప్పాజీ అనే వ్యక్తిని అరెస్టు చేసి భీమవరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రమేష్ చెప్పారు.



గంజాయి స్వాధీనం.. 9 మంది అరెస్టు

పోడూరు: గంజాయిని కలిగిన ఉన్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒక మైనర్ సహా తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోడూరు-కవిటం (పీహెచ్‌సీ రోడ్డు) రోడ్డు మార్గంలో మండపాకకు చెందిన కుడిపూడి జయకిరణ్, జంగం లక్ష్మీగణపతి ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి ఈ నెల 10వ తేదీన కొంతమందికి పంచుతున్న సమయంలో తమకు అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో కుడిపూడి జయకిరణ్, జంగం లక్ష్మీగణపతి, నాగబత్తుల ప్రదీప్, నవరపు చిట్టిబాబు, ఈగ ఉమేష్, పఠాన్ లతీఫ్, చిట్టూరి ప్రకాష్, మరో మైనర్‌ను అరెస్టు చేశామన్నారు. ఇదే కేసుకు సంబంధించి షైక్ కమల్, అశోక్, కృష్ణ, అనే మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. నిందితుల నుంచి రూ.1 లక్ష విలువైన 10 కేజీల గంజాయి, 2 ద్విచక్రవాహనాలు, 8 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అదేరోజు పాలకొల్లు కోర్టులో హాజరపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

ఆగమ పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ



శ్రీవారి దేవస్థానం ఏఈఓ దుర్గారావుకు కంప్యూటర్లను అందజేస్తున్న దాతలు దుర్గాదేవి, సత్యవతి

ద్వారకాతిరుమల : శ్రీవారి దేవస్థానం ఆగమ పాఠశాలకు గుంటూరుకు చెందిన అక్కచెల్లెళ్లు వెలగలేటి దుర్గాదేవి, సత్యవతి 4 కంప్యూటర్లను బహూకరించారు. వీటిని ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు. ఆగమ విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించేందుకు వీటిని వినియోగించాలని ఈ సందర్భంగా దాతలు కోరారు. గతంలో సైతం ఈ దాతలు చినవెంకన్న దేవస్థానానికి ఎయిర్ కూలర్స్, అంబులెన్స్, బ్యాటరీ కార్లు, చిల్డ్రన్స్ పార్క్‌లో పరికరాలను అందజేశారు. వీరి దాతృత్వాన్ని ఆలయ అధికారులు అభినందిస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి 6 నెలల జైలు

నూజివీడు: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన దండమూడి విజయ్‌కుమార్.. కుప్పాల సంపత్‌కుమార్‌కు 2018 సంవత్సరం మే నెలలో రూ.2 లక్షల నగదును అప్పుగా ఇచ్చాడు. తరువాత కొంతకాలానికి విజయ్‌కుమార్ తన బాకీ తీర్చమని సంపత్‌కుమార్‌ను అడగగా 2019 జూన్ 27న సంపత్.. విజయ్‌కుమార్‌కు రూ.2.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఈ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో బాధితుడు కోర్టులో కేసు వేయగా విచారణ జరిపిన స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి నిందితుడు సంపత్‌కుమార్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.



క్లుప్తంగా

సజ్జలను కలిసిన చీకటిమిల్లి


సజ్జలకు ముఖ్యమంత్రి జగన్ చిత్రపటాన్ని బహుకరిస్తున్న చీకటిమిల్లి

తాడేపల్లిగూడెం అర్బన్ : మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాన్ని బుధవారం బహుకరించారు. ఈ సందర్భంగా చీకటిమిల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలు జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. తెదేపా నాయకుడు చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు జగన్ ప్రభుత్వంపై బురద చల్లుతున్నాడరన్నారు. ప్రజలు చంద్రబాబును నమ్మడం లేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అమలు తీరును, జగన్ పరిపాలన దక్షతను ప్రజలకు వివరించి ప్రచారం చేసేందుకు తమను వినియోగించుకోవాలని సజ్జలను చీకటిమిల్లి కోరారు.

సురక్షతో అన్ని వర్గాలకు మేలు


ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, పార్టీ నాయకులు

అత్తిలి: జగనన్న సురక్ష కార్యక్రమంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుంద ని ఉనికిలి సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు, అర్హత ఉండి, సాంకేతిక సమస్యతో సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రజలు తెలిపిన పలు సమస్యలను పరిష్కరిస్తామని ప్రజా ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ముదునూరి దుర్గాభవానీ, కార్యదర్శి ఫణిరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్


అలంపురం జయా గార్డెన్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

పెంటపాడు: మండలం అలంపురం గ్రామంలోని జయా గార్డెన్ నుంచి తాడేపల్లిగూడెంలోని సభాస్థలికి బుధవారం సాయంత్రం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ర్యాలీగా వెళ్లారు. ఈ సమయంలో జాతీయరహదారి, తాడేపల్లిగూడెం-తణుకు రహదారులపై వాహనాలు భారీగా స్తంభించిపోయాయి. సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రాకపోకలకు ఆటంకం కలగడంతో బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లోని గృహిణులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జనసైనికులు బస్సుపై ఎక్కి హల్‌చల్ చేశారు.

ప్రసంగం మధ్యలోనే వెనుతిరిగిన మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని ఎస్వీఆర్ సెంటర్‌లో పవన్‌కల్యాణ్ సభలో ప్రసంగిస్తుండగానే మధ్యలోనే మహిళలు వెనుతిరగడం కనిపించింది. మహిళలకు ప్రత్యేకంగా బ్లాక్‌లు ఏర్పాటు చేసినా సరిపడా చోటు కల్పించకపోవడంతో వెనుదిరిగినట్టు తెలుస్తోంది. వీరితో పాటు యువకులు సైతం పవన్ సభావేదిక నుంచి దూరంగా రావడం గమనార్హం.

అతిథి అధ్యాపక పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 13న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు కోరారు. ఓఏఎస్(ఆఫీస్‌అసిస్టెంట్) ఎంఎల్‌టీ(మెడికల్ లాబ్ టెక్నీషియన్) టైపు, షార్ట్‌హేండ్, బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్‌లు బోధించేందుకు గాను జులై 13న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైపు, షార్ట్‌హేండ్ పోస్టులకు బీకాం 50 శాతం మార్కులతో పాస్ అయిన అభ్యర్థులు, బయో కెమిస్ట్రీ బోధించేందుకు 50 శాతం మార్కులతో ఎంఎస్సీ అర్హత , లేక ఎమ్మెస్సీ మైక్రోబయాలజీలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఇంగ్లీషు షార్ట్‌హేండ్ హయ్య ర్ గ్రేడ్‌ఇంగ్లీషు టైపు హయ్యర్ గ్రేడ్, అర్హత ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 13న ఉదయం 11 గంటలకు దరఖాస్తు, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరా రు.

సేవామూర్తులు.. వలంటీర్లు

- సంక్షేమ పథకాలను ఇళ్లకే చేరవేస్తున్న వారధులు
- కరోనా విపత్తు వేళ ప్రాణాలకు తెగించి సేవలు
- ఆసుపత్రులకు వెళ్లి మరీ పింఛన్ల అందజేత

తణుకు, తణుకు టౌన్, తణుకు అర్బన్: వలంటీర్ వ్యవస్థ అనేది సేవకు పర్యాయ పదంగా మారింది. వలంటీర్ల సేవలను మన రాష్ట్రం మాత్రమే కాదు..దేశం మొత్తం కొనియాడుతోంది. కరోనా విపత్తు వేళ వలంటీర్ వ్యవస్థ లేకుండే ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయి ఉండేవి. కరోనా సోకిన వారిని కుటుంబ సభ్యులు విస్మరించినా తామున్నామంటూ వలంటీర్లు నిషేధిత ప్రాంతాలకు వెళ్లి మందులు, పౌష్టికాహారం అందించి ఎంతో మంది ఊపిరి నిలిపారు. ప్రతి 50ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వలంటీర్లు ప్రతి కుటుంబ వ్యక్తిగత వివరాల సేకరించి, వారికి ఏయే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయో తెలియజేస్తున్నారు. అంతేగాకుండా వారి చేత దరఖాస్తు చేయించి పథకాల లబ్ధిని చేరవేస్తున్నారు. మన వీధికి ఏ సమయంలో రేషన్ వాహనం వస్తుందో ముందుగానే సమాచారం ఇస్తున్నారు. బీమా పథకంలో అర్హులను చేర్పించి, వారి కుటుంబాల్లో భద్రత నింపే బాధ్యతను కూడా వలంటీర్లు తీసుకుంటున్నారు. కుల, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజీ వంటి సర్టిఫికెట్లను ఇంటికే అందిస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు ఇప్పించడం, ఆధార్ కార్డుల్లో మార్పులు చేయించడం, ఇళ్లు లేని పేదలను గుర్తించి, పక్కా గృహాలకు దరఖాస్తు చేయిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్‌దారులకు ఇళ్లకు, అవసరమైతే పొరుగూర్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందే రాయితీనలు తెలియజేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఇటీవల ఒడిశా ఘోర రైలు ప్రమాదంలో చిక్కుకున్న మన ప్రాంత వాసుల వివరాలు అధికారుల ద్వారా సేకరించి వారి కుటుంబ సభ్యులకు అందించడంలోనూ చురుకైన పాత్ర పోషించారు. అందుకే వలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా వారికి పురస్కారాలు అందించి గౌరవిస్తోంది. వలంటీర్లు అందిస్తున్న సేవలు..చేకూరిన లబ్ధి ప్రజల మాటల్లోనే...

విలువ కట్టలేం



నాపేరు అత్తిలి కామాక్షి, వేల్పూరు గ్రామంలో నివాసం ఉంటున్నాను. మా వలంటీర్ కొమ్మోజు జ్యోతి వలనే నేను పునర్జన్మ పొందాను. కోవిడ్ సమయంలో గుండె పోటు వస్తే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా సకాలంలో కార్పొరేట్ వైద్యం అందించారు. ఎవరూ తోటి మనిషిని పట్టించుకోని రోజుల్లో వలంటీర్ ఎప్పటికప్పుడు నా పరిస్థితిని గమనించి ఆసుపత్రిలో వైద్యం చేయడానికి సహకరించడంతో పాటు ఎవరూ లేని నాకు కోవిడ్ సమయంలో దాతలు అందించిన బియ్యం, ఇతర నిత్యావసరాలను ఇంటి వద్దకు అందించారు. వలంటీర్ చేసిన సేవలను, ఎప్పటికీ వరులేను.

– అత్తిలి కామాక్షి, వేల్పూరు, తణుకు రూరల్ మండలం.

కష్టాలు తీరాయి



నా పేరు చందా బాల బాలాజీ. నేను తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నివాసం ఉంటున్నాను. కోవిడ్ సమయంలో తలలో రక్తం గడ్డకట్టడంతో మంచంపైనే పక్షవాతం రావడంతో ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందించేలా మా వలంటీర్ బర్రే మహేష్ ఎంతో సహకరించారు. రాజమండ్రిలోని బొల్లినేని ఆసుపత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించడానికి వలంటీర్ ఎంతో సహాయం చేశారు. గత సంవత్సరం నుంచి రూ. 3 వేల పింఛన్ అందించడంతో పాటు తాను కాలుకు గాయమైనా ఇతరుల సహాయంతో ఇంటికి వచ్చి పింఛన్ అందించి ఎంతో సహాయం చేశారు.

– చందా బాల బాలాజీ, వేల్పూరు, తణుకు రూరల్ మండలం

కోవిడ్‌లో వలంటీర్ల సేవలు భేష్



నా పేరు కె.శ్రీదేవి. నేను తణుకు 27వ వార్డులో నివసిస్తున్నాను. కరోనా సమయంలో వలంటీర్ వ్యవస్థ నా కుటుంబాన్ని కాపాడింది. నాకు కోవిడ్ సోకింది. అయితే కోవిడ్ సమయంలో ముట్టుకుంటే వ్యాధి సోకుతుందేమోనని భయపడే పరిస్థితుల్లో పక్కవారు సైతం ఎవ్వరూ మాట్లాడకపోయినా మా వలంటీరు లక్ష్మి మాత్రం ఇంటికి వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకునేది. అంతేకాకుండా కోవిడ్ పరీక్షలతో పాటు వ్యాక్సిన్ కూడా వలంటీరే దగ్గర ఉండి వేయించారు. కేసులు ఎక్కువగా ఉండి మా ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా పరిగణించినప్పటికీ రెడ్‌జోన్‌లోకి వచ్చి మా వలంటీరు సేవలందించేవారని చెబుతున్నారు.

– శ్రీదేవి, తణుకు

విద్యార్థుల విద్యపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలి


తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషులత


సమావేశంలో పాల్గొన్న ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు

తాడేపల్లిగూడెం రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని, కొంతమంది విద్యార్థులకు ఆరో తరగతిలోనూ వర్ణమాల రాని పరిస్థితి నెలకొందని పలువురు సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యాబోధన చేయాలన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలని కోరారు. గ్రామాల్లో దిగువకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, లేదంటే ఈదురు గాలులకు తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ఎంపీపీ శేషులత మాట్లాడుతూ సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ మాట్లాడుతూ మండలంలోని ఐదు గ్రామాల్లో భూముల రీ-సర్వే కార్యక్రమం పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ రైతు తమ భూమిని సర్వే చేయించుకుని తమ పత్రాలను డిజిటలైజ్ చేసుకోవాలన్నారు. భూములకు ఖచ్చితమైన సరిహద్దులతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరమవుతుందన్నారు. జనన మరణాలను త్వరితగతిన పంచాయతీల్లో నమోదు చేసుకోవాలన్నారు. విద్యా శాఖ అంశంపై టీవోటీ రాజు మాట్లాడుతూ గతంలో పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఇంటి వద్దే ఉంటూ పరీక్షలు రాసేవారన్నారు. అయితే, నేడు ఆ పరిస్థితికి స్వస్తి చెప్పడం జరిగిందన్నారు. వారిని పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించి విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఉద్యాన శాఖ అంశంపై ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులకు వివరించి, వాటిని వినియోగించుకునేలా చూడాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 498మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోకపోవడం వల్ల పీఎం కిసాన్ సొమ్ములు పడలేదన్నారు. వెంటనే సదరు రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులు పొందాలని, లేకుంటే పండించిన పంటను విక్రయించుకునే అవకాశం ఉండదన్నారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కట్టా రంగ బాబు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, మండల పరిషత్ ఏవో ఆర్.సుజాత, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, జంపెల్లి సత్యవతి, సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


తణుకులో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు చాకలిచెరువు, జయంతి కాలనీలో బుధవారం ఫీవర్ సర్వే, మస్కిటో లార్వా, డెన్సిటీ, డెంగ్యూ నివారణ మాసోత్సవం వంటి కార్యక్రమాలపై ప్రజానీకానికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యాధుల నివారణకు ప్రతిరోజు తప్పనిసరిగా డ్రైడే పాటించాలని, వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను భుజించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఫీవర్ సర్వే చేస్తున్న సమయాల్లో వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కె.పృథ్వీరాజ్, వార్డు హెల్త్ సెక్రటరీ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు అత్తిలి మండలంలో మంత్రి కారుమూరి పర్యటన

అత్తిలి: నేడు అత్తిలి మండలంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. గురువారం ఉదయం అత్తిలి గ్రామంలో వేంచేసియున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఊరేగింపు ఉత్సవంలో పాల్గొంటారని, అనంతరం ఉనికిలి గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేస్తారని తెలిపారు. పార్టీనాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

అవసరాల కోసమే స్థలాల సేకరణ


మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ఏ.శామ్యూల్, టీపీఓ హరి

తాడేపల్లిగూడెం: పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవసరాల నిమిత్తం ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా రహదారి విస్తరణ కోసం కె.ఎన్.రోడ్‌లో స్థలాలను సేకరించి, అవి ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చామని కమిషనర్ ఏ.శామ్యూల్ బుధవారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. కెఎన్‌రోడ్డును మాస్టర్‌ప్లాను 100 అడుగులు రోడ్డుగా డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ 1988 సంవత్సరంలో ఆమోదం తెలిపారన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు 80 అడుగులు మాత్రమే ఉందన్నారు. దీంతో రెండు పక్కల పదేసి అడుగుల వంతున స్థలాలను తీసుకోవాల్సి ఉందన్నారు. దీని కోసం ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబరు 119, జీఓ నంబరు 180, జీఓ 179 ప్రకారం రోడ్డు విస్తరణ దృష్ట్యా తొమ్మిది మంది దగ్గర నుంచి స్థలాలను తీసుకొని, ఆయా స్థలాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పురపాలక సంఘానికి రిజిస్టర్ చేయించి , ఆ స్థలానికి మార్కింగ్ చేసిన తర్వాత టీడీఎస్ బాండ్లు ఇచ్చామన్నారు. పెంటపాడు నుంచి పోలీసు ఐలాండ్ వైపునకు మూడు స్థలాలు, కుడి పక్కన ఆరు స్థలాలను తీసుకొని టీడీఆర్ బాండ్లు ఇచ్చామని, ఈ స్థలాలు మునిసిపాలిటీ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. ఈ స్థలాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళికా విభాగ అధికారులను ఆదేశించామన్నారు. ఒక థియేటర్‌కు సంబంధించి ప్రహరీగోడను తొలగించాల్సి ఉందని, అది తొలగించుకోడానికి స్థల యజమాని 15 రోజులు సమయం అడిగారన్నారు. పట్టణ ప్రణాళిక అధికారి హరికుమార్ పాల్గొన్నారు.

సొంతింటి కల... నెరవేరిన వేళ

- జగనన్న కాలనీలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు
- అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం
- లబ్ధిదారుల హర్షం


ప్రత్తిపాడులో నిర్మాణ దశలో ఉన్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు

పెంటపాడు: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలందరికీ ప్రధాన కోరిక సొంతిల్లు ఉండాలని కలలు కంటారు. కానీ నేటి పరిస్థితుల్లో ఆ కోరిక చాలామందికి కల గానే మిగిలిపోయింది. అయితే వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కలను సాకారం చేశారు. పేదలందరికీ ఇళ్లు ఇస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి రాగానే కార్యాచరణ చేపట్టారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు మండలంలోని 22 గ్రామాల్లో 26 లే అవుట్‌లు ఏర్పాటు చేసి వాటిలో 1400 ప్లాట్లు వేసారు. వాటిని 1370 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 382 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 507 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. బిలో బేస్‌మెంట్ లెవెల్(బీబీఎల్) 481 ఉన్నాయి. ఇంకా రెండో ఫేజ్‌లో 5 లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో త్వరలో చేపడతారు.

ఇంటి నిర్మాణానికి సాయం

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నగదును బేస్‌మెంట్, రూఫ్, తదితర లెవల్, శ్లాబ్ నిర్మాణం పూర్తయ్యాక వివిధ దశల్లో అందజేస్తుంది. ఈ నగదు నేరుగా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. అలాగే సొంత స్థలమున్న వారికి ఈ పథకం వర్తిపజేస్తున్నారు. 1.50 సెంట్లు ఉన్న అర్హులు ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహనిర్మాణశాఖ ద్వారా ఈ అవకాశం కల్పించింది. ప్రతిపక్షలతో కోర్టు వివాదాలు పేదలందకి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. వారు కొన్ని స్థలాల విషయంలో కోర్టుకు ఎక్కడంతో కొన్ని గ్రామాల్లో పేదలకు ఇళ్లస్థలాలు దక్కలేదు. మండలంలోని నాలుగైదు, గ్రామాల్లో ఈ సమస్య ఏర్పడింది.

అద్దె కట్టలేక ఇబ్బంది పడ్డాం



సొంతిల్లు లేకపోవడంతో అద్దె కట్టుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రతీనెలా రూ. 2,500 నుంచి 4 వేలు వరకు చెల్లించాల్సి పరిస్థితి ఏర్పడేది. మండల కేంద్రాలలో ఈ భారీ మరీ ఎక్కువగా ఉండేది. నా సొంతింటి కల నెరవేరడంవతో ఆనందంగా ఉంది.

– గుబ్బల వెంకటలక్ష్మి, బి.కొండేపాడు, లబ్ధిదారురాలు

జగనన్న మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మేలు ఎప్పటికీ మరచిపోలేం. ఆయన చొరవతో సొంతిల్లు నిర్మించుకొన్నాం. త్వరలో గృహ ప్రవేశం చేసుకుంటాం.మండలంలోని 1.50 సెంట్లు స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మిణం కోసం రూ. 1.8 లక్షలు అందించారు. జగనన్నకు కృతజ్ఞతలు.

– కేదాశి వెంకటనరసమ్మ, కొండేపాడు, జగనన్న కాలనీ

జోరుగా ఇళ్ల నిర్మాణాలు



మండలంలోని 20 లే అవుట్‌ల్లో 1504 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వీటిలో 194 గృహాలు పూర్తి అయ్యాయి. 1302 గృహాలు నిర్మాణ దశల్లో ఉన్నాయి. తాగు నీరు, విద్యుత్, రోడ్లు మౌలికవసతులు కల్పిస్తున్నాం. ఫేజ్-2 లేవుట్‌కి సంబంధించి లబ్ధిదారులు ఎంపిక జరగుతోంది.

– జి. రాజేంద్రప్రసాద్, హౌసింగ్ శాఖ ఏఈ పెంటపాడు మండలం

ప్రతి ఇంటా సంతోషం


గుమ్మంపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు కరపత్రాలను అందజేస్తున్న యువనేత కారుమూరి సునీల్‌కుమార్

అత్తిలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు, యువనేత కారుమూరి సునీల్‌కుమార్ చెప్పారు. అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కారుమూరి సునీల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. లబ్ధిదారులు పథకాల కోసం నాయకుల చుట్టూ తిరిగే పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా అందించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ ఇంటింటికి వెళ్లి వారికి నాలుగేళ్ల కాలంలో ఆకుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంకా ఎవరైనా అర్హులై ఉండి పథకాలు రానివారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి కారుమూరి సునీల్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఏఎంసీ డైరెక్టర్ పెచ్చెట్టి రాము, స్థానిక నాయకులు పెన్మెత్స రంగరాజు, నడింపల్లి సుబ్బరాజు, బడేటి గంగాధరరావు(బాబ్జి), యాళ్ల సాధు సుందర్‌సింగ్, ఉన్నమట్ల శ్రీను, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మకు ఆషాఢ సారె సమర్పణ

తాడేపల్లిగూడెం రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారికి సారె గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సమర్పించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు పడాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు.

ఎంపీడీవోకు అభినందనలు


తణుకులో ఎంపీడీవో పీ.శ్రీనివాసరావుకు అభినందనలు తెల్పుతున్న ఉపాధ్యాయులు

తణుకు టౌన్: తణుకు మండలం అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన పీ శ్రీనివాసరావును ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. బుధవారం సాయంత్రం తణుకులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావును కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు టీజే జయకుమార్, దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.